# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక







సంపుటి :12 సంచిక :312 మంగళవారం 14-7-2026 పేజీలు:8 వెల:3
https://www.epaperjournalistdiary.com/


## ఇరాన్ రివెంజ్ లిస్టులో
# 13 మంది ప్రపంచ నేతలు

- ప్రతీకారం తప్పదు' అంటూ మోజ్తాబా ఖమేనీ తీవ్ర హెచ్చరిక
- రివెంజ్ లిస్ట్‌పై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చ
- ట్రంప్ భద్రతపై అమెరికా అప్రమత్తం
- హార్ముజ్ జలసంధి ఉద్రిక్తతలతో పెరిగిన ఆందోళన
- పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు
- ఇరాన్--అమెరికా తాజా పరిణామాలపై గల్ఫ్ దేశాల స్పందన
- ప్రతీకార వ్యాఖ్యలతో అంతర్జాతీయ వర్గాల్లో కలకలం

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు తో సహా పలువురి పేర్లు**

న్యూఢిల్లీ:
మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ నేతలపై ఇరాన్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన కుమారుడు మోజ్తాబా ఖమేనీ ఈనెల మొదటి బహిరంగ ప్రసంగం చేస్తూ, 13 మంది ప్రపంచ నేతలతో కూడిన ఒక 'రివెంజ్' లిస్టును ప్రకటించారు. ఇరాన్ జాతీయ దినపత్రిక 'హమ్ షాహ్రీ' శనివారం రాత్రి ఈ జాబితాను ఆన్‌లైన్‌లో -మిగతా 2 లో





## హెర్ముజ్‌లో నౌకలపై 20% సుంకం..

- అమెరికా అధ్యక్షుడి ప్రకటన
- జలసంధి సంరక్షకురాలిగా అమెరికా వ్యవహరిస్తుంది
- ఇరాన్‌పై మళ్లీ దిగ్బంధనం
- అమెరికా జోక్యాన్ని అనుమతించబోమన్న ఇరాన్

వాషింగ్టన్,
హెర్ముజ్ జలసంధిని అమెరికా స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించిన కొన్ని గంటలకే ఇరాన్‌పై దిగ్బంధనాన్ని తిరిగి విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. హెర్ముజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా చూసుకుంటుందని, దాని గుండా వెళ్లే సరుకుపై 20 శాతం రుసుమును అమెరికా వసూలు చేస్తుందని కూడా ఆయన ప్రకటించారు. ఇరాన్ ఉన్నా లేకపోయినా హెర్ముజ్ జలసంధి తెరిచే ఉంది, తెరిచే ఉంటుంది. మేము ఇరాన్ దిగ్బంధనాన్ని పునరుద్ధరిస్తున్నాము. ఈ దిగ్బంధనం కేవలం ఇరాన్ నౌకలు లేదా వినియోగదారులను మాత్రమే అడ్డుకుంటుంది. ఇతర దేశాలన్నీ ఈ జలసంధిని న్యాయబద్ధంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ఇకపై హెర్ముజ్ సంరక్షకురాలిగా అమెరికా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోని అత్యంత ఉద్రిక్తతలతో కూడిన ఈ ప్రాంతానికి భద్రత కల్పించే బాధ్యతను నిర్వహించడానికి అయ్యే ఖర్చులన్నింటికీ పరిహారంగా ఈ మార్గం గుండా రవాణా అయ్యే సరుకుపై 20% రుసుమును అమెరికా వసూలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు.
ఇరాన్ తిరస్కరణ -మిగతా 2 లో



## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

- రాష్ట్రవ్యాప్తంగా 1,53,752 మంది అభ్యర్థుల దరఖాస్తు
- 1,15,028 మంది పరీక్షకు హాజరు
- 50,544 మంది అర్హత సాధించిన అభ్యర్థులు
- శాతం 43.94 ఉత్తీర్ణత
- ఫలితాలు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి
: తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 ఫలితాలను సోమవారం మధ్యాహ్నం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఆధారంగా ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. ఈ ఫలితాల్లో అభ్యర్థుల మార్కులు, అర్హత తదితర వివరాలు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. జూన్ 16వ తేదీ నుంచి 22వ తేదీ మధ్య మొత్తం పది సెషన్లలో ఈ పరీక్షలు జరిగాయి. ఏడాది డీజీ టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,53,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,15,028 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 23,623 మంది ఇన్ సర్వీస్ టీచర్లు, 91,405 మంది ఇతర అభ్యర్థులు ఉన్నారు. మొత్తం పరీక్ష రాసిన వారిలో 50,544 -మిగతా 2లో

## రాష్ట్ర ప్రయోజనాలే
# ముఖ్యం

**పార్టీలకు అతీతంగా పార్లమెంటులో తెలంగాణ వాణి వినిపించండి**

- కేంద్ర అనుమతుల కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయండి
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డిపై నిపుణుల కమిటీకి సానుకూల స్పందన
- ఆర్ఆర్ఆర్, మెట్రో, ఐఐఎం సహా పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి
- గోదావరి జలాలు, తుంగభద్ర పూడిక అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపు
- తెలంగాణ భవన్‌లో ఎంపీల సమన్వయానికి ఐఏఎస్ అధికారిని నియమించిన ప్రభుత్వం
- రాష్ట్ర సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు
- ఎంపీల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (జర్నలిస్టు డైరీ) జూలై 13
తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో గళాన్ని వినిపించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దానికోసం రాజకీయాలకు అతీతంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారంనాడాయన హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఎంపీలతో భేటీ అయ్యారు. దీనికి కాంగ్రెస్ ఎంపీలతోపాటు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి కూడా హాజరయ్యారు. అధికారపార్టీ నిర్వహించే ఎంపీల సమావేశంలో ప్రతిపక్ష ఎంపీలు కూడా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా పార్లమెంటులో రాష్ట్ర ప్రయోజనాల కోసం -మిగతా 2లో



## షాబాద్ నరహంతకుడు మృతి

- ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు
- డయల్ 100కు సమాచారం పోలీసుల ఎంట్రీ
- మృతుడిని రాజ్ కుమార్‌గా నిర్ధారించిన పోలీసులు
- మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ గుర్తింపు
- నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్న పోలీసులు

హైదరాబాద్ ((జర్నలిస్టు డైరీ) జూలై 13
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్ కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజరలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్ కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం -మిగతా 2 లో

## పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

- కీలక ప్రతిపాదన చేసిన యూరోపియన్ యూనియన్
- వయో పరిమితిని తీసుకొస్తున్నట్లు మీడియాకు వెల్లడి



2 లో




# అట్టడుగున భారత్

- పర్యావరణ పనితీరు సూచీలో మళ్లీ నిరాశే
- ప్రపంచవ్యాప్తంగా 177 దేశాల్లో 176వ ర్యాంకు
- దక్షిణాసియాలోనూ చివరి స్థానమే : ఈపీఐ నివేదిక
- గాలి కాలుష్యం, బొగ్గుపై ఆధారపడటం, జీవవైవిధ్య బలహీనతలే ప్రధాన కారణాలు
- పర్యావరణ నిపుణులు

న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 13
ప్రపంచ దేశాల పర్యావరణ పనితీరును అంచనా వేసే ఎన్విరాన్‌మెంట్ పర్ఫామెన్స్ ఇండెక్స్ (ఈపీఐ)-2026లో భారత్ మరోసారి అట్టడుగు స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 177 దేశాల్లో భారత్ 176వ ర్యాంకులో ఉంది. అంటే.. చివరి నుంచి రెండో స్థానం. భారత్‌కు ఈపీఐ స్కోరు 100లో 22.46 పాయింట్లు మాత్రమే లభించాయి. 74.79 పాయింట్లతో ఎస్టోనియా అగ్రస్థానంలో ఉంది. ఇక దక్షిణాసియా -మిగతా 2లో

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక
# బోనాల ఉత్సవాలు



**ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం**

- ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయం
- ఈ నెల 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్ దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు రూ.15 కోట్ల నిధులు విడుదల
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ (జర్నలిస్టు డైరీ) జూలై 13
తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. -మిగతా 2 లో

## సీఎంది 'షాబాద్ కిల్లర్'
# మైండ్‌సెట్

- రాజకీయాలు పక్కనబెట్టండి.. 'కన్నెపల్లి' ఆన్ చేయండి
- డెడ్ స్టోరేజీలో ప్రాజెక్టులు
- తాగునీటికీ గడ్డు పరిస్థితులు
- ఉత్తర తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం
- కరీంనగర్ ఎల్ఎమ్‌డిని సందర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కరీంనగర్ ( జర్నలిస్టు డైరీ) జూలై 13
'మాపై కోపంతో సీఎం రేవంత్‌రెడ్డి నీళ్లు ఎత్తిపోయకుండా రైతులను వేధిస్తున్నారు. ఆయన వైఖరి 'షాబాద్ కిల్లర్' మైండ్ సెట్‌లా ఉంది.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత వైఖరి వల్ల ఇప్పటికే ప్రాజెక్టులన్నీ డెడ్‌స్టోరేజీలోకి వెళ్లి తాగునీటికీ గడ్డు పరిస్థితులను తెచ్చిపెట్టాయి.. ఉత్తర తెలంగాణ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉంది.." అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల పర్యటనలో భాగంగా -మిగతా 2లో

# తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

మొదటి తరువాయి

మంది అభ్యర్థులు అర్హత సాధించగా, ఉత్తీర్ణత శాతం 43.94 శాతంగా నమోదైంది. కమ్యూనిటీ వారీగా చూస్తే రాజ అభ్యర్థులు 51.03 శాతం అర్హతతో అగ్రస్థానంలో నిలిచారు. అనంతరం డీజీ అభ్యర్థులు 40.36 శాతం, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 22.43 శాతం, జనరల్ కేటగిరీ అభ్యర్థులు 20.15 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసారి పరీక్షల్లో మహిళా అభ్యర్థులు పురుషుల కంటే మెరుగైన ఫలితాలు నమోదు చేశారు. పేపర్-1 లో పరీక్ష రాసిన నలుగురు ట్రాన్స్‌జెండర్ అభ్యర్థుల్లో ఇద్దరు అర్హత సాధించారు. పేపర్-2 (మ్యాథ్స్) విభాగంలో 32,555 మంది మహిళలు హాజరుకాగా 12,495 మంది అర్హత సాధించారు. అదే విభాగంలో 11,567 మంది పురుషులు హాజరుకాగా 5,488 మంది క్వాలిఫై అయ్యారు. ఆరుగురు ట్రాన్స్‌జెండర్ అభ్యర్థుల్లో నలుగురు అర్హత సాధించడం విశేషం. అలాగే పేపర్-2 (సోషల్ స్టడీస్) విభాగంలో 23,008 మంది మహిళలు పరీక్ష రాయగా 5,009 మంది అర్హత సాధించారు. మహిళల ఉత్తీర్ణత శాతం అన్ని విభాగాల్లోనూ మెరుగ్గా ఉండటం గమనార్హం.

# హెర్ముజ్‌లో నౌకలపై 20% సుంకం..

మొదటి తరువాయి



ట్రంప్ ప్రతిపాదనకు ఇరాన్ నుంచి వెంటనే ప్రతిస్పందన వెలువడింది. హెర్ముజ్ జలసంధి నిర్వహణలో అమెరికా పాత్రను ఇరాన్‌కు చెందిన సంయుక్త సైనిక కమాండ్ తోసిపుచ్చింది. వ్యూహాత్మక జలమార్గంలో అమెరికా జోక్యాన్ని అనుమతించబోమని, ఇరాన్ అనుమతి లేకుండా జలసంధి గుండా ప్రయాణించడానికి అమెరికా దళాలు ప్రయత్నిస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని సైనిక కమాండ్ హెచ్చరించింది. ఈ విషయంలో అమెరికాకు సహకరించవద్దని ప్రాంతీయ ప్రభుత్వాలను కూడా ఇరాన్ హెచ్చరించింది. అటువంటి సహకారాన్ని ఇరాన్‌పై యుద్ధంగా పరిగణిస్తామని తెలిపింది. ఘర్షణ విస్తృతమైతే అది ప్రాంతమంతటికీ విస్తరిస్తుందని, ఇందుకు అమెరికా, దాని మిత్రదేశాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొంది

# షాబాద్ నరహంతకుడు మృతి

మొదటి తరువాయి

పక్కన పాయిజన్ బాటిల్స్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది. కాగా.. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్ కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అర గంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్న పిల్లలను కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేలోని హోటళ్లు, లాడ్జిలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజరలో రాజ్ కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక
# బోనాల ఉత్సవాలు

మొదటి తరువాయి

జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభం, జూలై 20, 21, 22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా... 20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం, 21 న అమ్మవారి కల్యాణం, 22 నా రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు, ఆగస్టు 3న రంగం కార్యక్రమం, ఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలతో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీఎస్ఆర్టీసీ, రైల్వేస్, సమాచార ఒ పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దేవాలయాల వద్ద క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, భద్రత, ప్రత్యేక బస్సుల నిర్వహణ, పూల అలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు వంటి అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

పాత జీహెచ్ఎంసీ పరిధిలోని 3427 దేవాలయాలకు ప్రభుత్వం బోనాల ఉత్సవాల నిమిత్తం 15 కోట్ల 5 లక్షల 41 వేల 150 రూపాయలు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారి ఆధ్వర్యంలో విడుదల చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బోనాల సందర్భంగా గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ - పోచమ్మ, హరిబౌలిలోని అక్కన్న- మాదన్న దేవాలయం, కార్వాన్ దర్బార్ మైసమ్మ, లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి, చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, మీరాలం మండి శ్రీ మహంకాళి ఆలయాలతో పాటు నగరంలోని దాదాపు 30 ప్రధాన ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రులు, ఇతర ముఖ్య నేతలు అధికారులు, సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బోనాల ఉత్సవాల అనంతరం ఫలహారం బండ్ల ఊరేగింపు జరగనుంది. బోనాల పండుగ తెలంగాణా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, భక్తులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు పోలీసులు, ప్రభుత్వ శాఖల సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి భక్తుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న బోనాల ఉత్సవాలకు ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సులను నడిపిస్తుందున రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# ఇరాన్ రివెంజ్ లిస్టులో 13 మంది ప్రపంచ నేతలు

మొదటి తరువాయి

ప్రచురించింది. ఈ రివెంజ్ లిస్ట్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.

రివెంజ్ లిస్టులో ఉన్నది వీళ్లే

ఈ రివెంజ్ లిస్టులో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ముఖాలపై స్నైపర్ గన్ గురిపెట్టినట్లు చూపించారు. మిగిలిన 11 మంది నేతలు ఆరెంజ్ కలర్? టైలు ధరించి ఉన్నారు. ఆ 11 మందిలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, అమెరికా సెంట్రల్ కమాండ్ కమాండర్ బ్రాడ్ కూపర్, ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారి మైక్ హకబీ, ఇజ్రాయెల్ రక్షణ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ హెర్జీ హలేవీ, ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ ఉన్నారు.

మొజ్తాబా ఖమేనీ హెచ్చరిక

ఈ సందర్భంగా మొజ్తాబా ఖమేనీ మాట్లాడుతూ, "ప్రతీకారం అనేది మా దేశ సంకల్పం. ఇది కచ్చితంగా జరిగి తీరుతుంది. ఈ జాబితాలో ఉన్న నేరస్తులు తమ పరుపులపై ప్రశాంతంగా ప్రాణాలు వదలాలనే కోరికను మేము నెరవేర్చనియ్యం. వారిని ప్రశాంతంగా చావనివ్వం" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే తన తండ్రి మరణానికి కచ్చితంగా ఎవరు కారణమో మొజ్తాబా ఖమేనీ నేరుగా పేర్కొనలేదు. మరోవైపు 'హమ్ షహ్రీ' పత్రిక ఆన్?లైన్?లో ప్రచురించిన గ్రాఫిక్ పిక్చర్స్ తెహ్రాన్ ప్రభుత్వం అధికారికంగా ఆమోదించినట్లు ఎలాంటి సంకే తాలు కనిపించలేదు. ఫిబ్రవరి 28న జరిగిన దాడిలో ఆయ తుల్లా అలీ ఖమేనీ మరణించారు. అదే దాడిలో మొజ్తాబా కూడా గాయపడ్డారని వార్తలు వచ్చాయి. ఇటీవల జరిగిన అలీ ఖమేనీ అంత్యక్రియల్లో కూడా మొజ్తాబా ఖమేనీ పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో మొజ్తాబా మొదటిసారి బహిరంగ ప్రసంగం చేసి, ఈ రివెంజ్ లిస్టును ప్రకటించడం గమనార్హం.

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర?

కాగా, ట్రంప్?ను హత్య చేసేందుకు ఇరాన్? ప్లాన్ చేస్తోందని ఇప్పటికే అమెరికా మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఇజ్రాయెల్ కూడా ఇదే విషయాన్ని అమెరికాకు అందించింది. ఈ నేపథ్యంలో ట్రంప్?కు పొంచి ఉన్న ముప్పుపై అమెరికా అధి కారులు నిఘా పెంచారు. ఈ భద్రతా కారణాల వల్లే తుర్కియే లో జరిగిన నాటో సదస్సు నుంచి తిరిగి వచ్చేటప్పుడు, ట్రంప్ విమానాన్ని మార్చి పాత విమానంలో ప్రయాణించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ, "ఇరాన్ అమెరికా అధ్యక్షుడిని అయన నన్ను అంతం చేయాలని చూస్తున్నారు. నేను వారి హిట్ లిస్టులో ఉన్నాను" అని ఎయిర్?ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

మొదటి తరువాయి

అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని ఎంపీలందరికీ అందచేస్తామని సీఎం చెప్పారు. నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కేంద్రం నుంచి అవసరమైన అనుమతుల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి మంజూరు కోసం విజ్ఞప్తి చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-I స్వాధీనం, ఫేజ్-II విస్తరణకు సంబంధించి ఎస్బీఐక్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందనీ, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా చూడాలని సూచించారు. దీనికి బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో పనుల ప్రారంభానికీ, దక్షిణ భాగం భూ సేకరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం కోసం యత్నించాలని సూచించారు.మూసీ పునరుజ్జీవం పనులను అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద తీసుకునే విషయంలో కేంద్ర అనుమతి కోసం ఆ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావాల్సి ఉన్నా, పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటకను ఒప్పించాలని సీఆర్ పాటిల్‌ను కోరామనీ, ఈ విషయంపైనా ఎంపీలు కేంద్ర మంత్రిని కలవాలని సూచించారు. గోదావరిలో ఛత్తీస్‌గఢ్‌కు ఉన్న 300 టీఎంసీల నీటిని ఆ రాష్ట్రం వాడుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయనీ, అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. నదుల అనుసంధానంలో గోదావరి నుంచి నాగార్జున సాగర్‌కు నీళ్లు తీసుకునే విషయంలో ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఆ రెండింటిని రాష్ట్రానికి అనుకూలంగా సాధించాలని సీఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ నుంచి నిరభ్యంతర పత్రాలు వస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150 నుంచి151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ అవుదామని ఎంపీలతో సీఎం అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగుళూరు, చెన్నై, ముంబయిలకు వెళ్లే బుల్లెట్ రైళ్లు, ఆదిలాబాద్ డిఫెన్స్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూ సేకరణ పూర్తి చేశామన్నారు. ఎంపీలు వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. పార్టీలకతీతంగా ఎంపీలకు అవసరమైన సమాచారం అందిస్తూ, సమన్వయం చేసుకోవడానికి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఐఏఎస్ అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌ను నియమించామని తెలిపారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఆయన దగ్గర నుంచి తీసుకోవాలని సూచించారు. అన్ని పార్టీల ఎంపీలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని మల్లు రవికి సీఎం సూచించారు. రాష్ట్రంలో పండే ధాన్యానికి తగిన మిల్లింగ్ సామర్థ్యం లేదనీ, స్టోరేజీ సమస్య ఉందని ఈటల రాజేందర్ అన్నారు. ప్రొటోకాల్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గద్వాల దగ్గర మూతపడిన ఆయిల్ మిల్లు పునరుద్ధరణపై మల్లు రవి అధికా రులను ప్రశ్నించారు. ఏడెనిమిది నెలల్లో పునరుద్ధరణ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. పార్లమెంట్‌లో ప్రశ్నలు వేయడానికి వీలుగా ఈ సమావేశాలు చాలా ముందుగా ఏర్పాటుచేయాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఎంపీలంతా ఏదో ఒక స్టాండింగ్ కమిటీ, కన్సల్టెన్సీ కమిటీల్లో సభ్యులుగా ఉంటారనీ, ఆ సమాచారం తీసుకుని ఆయా అంశాలకు సంబం ధించిన పెండింగ్ విషయాలు తెలియజేస్తే పార్లమెంట్ సమావేశాల్లో తాము చర్చించేందుకు వీలుంటుందని రామసహాయం రఘురామిరెడ్డి అన్నారు.

# అట్టడుగున భారత్

మొదటి తరువాయి

దేశాల్లో కూడా భారత్ ఎనిమిదో స్థానంలో (ఇదే అట్టడుగు ర్యాంకు) ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యేల్, కొలంబియా విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ప్రతి రెండేండ్లకోసారి విడుదల చేసే ఈ సూచీ.. పర్యావరణ ఆరోగ్యం, జీవావరణ వ్యవస్థల పరిరక్షణ, వాతావరణ మార్పుల నియంత్రణ వంటి అంశాలపై దేశాల పనితీరును విశ్లేషిస్తుంది. ఈ ఏడాది 47 సూచికలను, 12 ప్రధాన విభాగాలను ఆధారంగా చేసుకొని ఈ ర్యాంకింగ్‌ను రూపొందించారు.

మూడు కీలక రంగాల్లోనూ వెనుకబాటు

భారత్ పర్యావరణ ఆరోగ్యం విభాగంలో 174వ ర్యాంకు పొందింది. జీవావరణ వ్యవస్థల పరిరక్షణ (ఎకోసిస్టమ్ వైటాలిటీ)లో 171వ స్థానం, వాతావరణ మార్పుల నియంత్రణ (క్లైమేట్ చేంజ్ మిటిగేషన్)లో 130వ స్థానంలో నిలిచింది. నివేదిక ప్రకారం భారత్‌లో సూక్ష్మ ధూళి కణాలు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి కాలుష్య కారకాలతో ఆరోగ్య నష్టం గణనీయంగా కొనసాగుతోంది. సముద్ర జీవ వైవిధ్య పరిరక్షణ, సముద్ర సంరక్షిత ప్రాంతాల నిర్వహణలోనూ పనితీరు అత్యంత బలహీనంగా ఉంది.

వేగంగా పెరుగుతున్న కర్బన ఉద్గారాలు

భారత్‌లో తలసరి కర్బన ఉద్గారాలు ప్రపంచంలోని అనేక దేశాలతో పోలిస్తే తక్కువగానే ఉన్నప్పటికీ.. వేగంగా పెరుగుతున్నాయని నివేదిక పేర్కొంది. కోట్లాది మంది ప్రజలకు విద్యుత్, ఆధునిక ఇంధన సౌకర్యాలు అందుతున్నప్పటికీ.. దాని పర్యవసానంగా నగరాల్లో తీవ్ర వాయు కాలుష్యం, గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలు పెరుగుతున్నాయని ఈపీఐ తేల్చింది. అయితే బొగ్గు ఆధారిత ఉత్పత్తిపై అధికంగా ఆధారపడటం, జీవవైవిధ్య పరిరక్షణకు తగిన చర్యలు లేకపోవడం, వాయు కాలుష్య నియంత్రణలో పరిమిత ఫలితాలే భారత్ ర్యాంకు దిగజారడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని పర్యావరణ నిపుణులు చెప్తున్నారు.

యూరప్ దేశాలవే అగ్రస్థానాలు

ఈసారి కూడా యూరప్ దేశాలే తొలి ఐదు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎస్టోనియా మొదటి స్థానంలో నిలవగా.. లక్సెంబర్గ్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫిన్లాండ్, నెదర్లాండ్స్ వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక లావోస్ 21.78 పాయింట్లతో చివరి (177వ) స్థానంలో నిలిచింది.

# సీఎంది 'షాబాద్ కిల్లర్' మైండ్‌సెట్

మొదటి తరువాయి

సోమవారం సాయంత్రం ఆయన ఎల్ఎండీని సందర్శించారు. ప్రాజెక్టులో నీటి నిల్వలను పరిశీలించిన అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ సహా ఎల్లంపల్లి, మధ్య, దిగువమానేరు, అనంతగిరి, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ వంటి కీలక జలాశయాలన్నీ నీళ్లు లేక ఎండిపోయే పరిస్థితికి వచ్చాయని తెలిపారు. 'ప్రస్తుతం ఎల్ఎమ్‌డీలో 5.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ ప్రాజెక్టుపైనే 8 నియోజకవర్గాల సాగుభూమి ఆధారపడి ఉంది. వారం రోజుల్లో కరీంనగరానికి తాగునీరూ కష్టమే' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్లంపల్లిలోనూ 4 నుంచి 5 టీఎంసీల నీరు మాత్రమే మిగిలిందని, అక్కడి నుంచి నీటిని తోడకపోతే హైదరాబాద్‌కు తాగునీటి ఎద్దడి తప్పదని చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్‌లో రోజుకు 15 వేల ట్యాంకర్లు బుక్ అవుతున్నాయంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చని వివరించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడవని నిపుణులు చెబితే వారిని బెల్టుతో కొట్టాలంటారు. కన్నెపల్లి పంప్‌హౌజ్ దగ్గర నీళ్లు ఎత్తిపోయొచ్చని విశ్రాంత ఇంజినీర్లు చెబితే వారిని కొట్టాలంటారు. మీడియా ప్రశ్నిస్తే .. బీఆర్ఎస్ వాళ్ల రక్తం చల్లితే పంటలు పండుతాయి అని నీచ భాష మాట్లాడుతున్నారు' అని సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించారు. ఒకవేళ రక్తం చల్లితేనే నీళ్లు ఇస్తానంటే.. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలమంతా రక్తదానం చేస్తామన్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారం చూస్తుంటే ఎవరి మీదనో కోపం ఇంకెవరి మీదనో చూపించే 'షాబాద్ కిల్లర్' మైండ్‌సెట్‌లా కనిపిస్తోందని ఆరోపించారు.?

# పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

**-కీలక ప్రతిపాదన చేసిన యూరోపియన్ యూనియన్**
**-వయో పరిమితిని తీసుకొస్తున్నట్లు మీడియాకు వెల్లడి**

**లండన్**

పిల్లలపై సోషల్ మీడియా ప్రభావాన్ని తగ్గించేందుకు అనేక దేశాలు చర్యలు తీసకుంటున్నాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ లాంటి దేశాలు వయో పరిమితిని తీసుకొచ్చాయి. ఈ క్రమంలోనే యూరోపియన్ యూనియన్ కీలక ప్రతిపాదన చేసింది. పిల్లలకు సోషల్ మీడియాను బ్యాన్ చేయాలని, వయసు పరిమితిని తీసుకువస్తున్నట్టు తెలిపింది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా దేర్ లెయెన్ మీడియాతో మాట్లాడుతూ.. 'మా పిల్లలను నిజమైన ప్రపంచంలో పెరిగేలా ప్రోత్సహిస్తాం.




ఆన్‌లైన్ ప్రపంచంలో కాదు. సోషల్ మీడియా ఆటబొమ్మ కాదు. పిల్లలను ఆడుకునేలా, తప్పులు చేసేలా, స్నేహాన్ని పెంచుకునేలా, ప్రవర్తనను నేర్చుకునేలా, వాళ్ల గుర్తింపును పెంచుకునేలా ప్రోత్సహిస్తాం. యూరప్ దేశాల్లో సోషల్ మీడియాను వాడాలంటే వయో పరిమితి ఉండేలా నిబంధన తీసుకొస్తున్నాం' అని ఆమె చెప్పారు.

మానసిక స్థితిని పెంచుతాం..

ఉర్సులా మాట్లాడుతూ.. ప్రస్తుతం సోషల్ మీడియాను వాడుతున్న పిల్లలు మానసికంగా సరైన స్థితిలో ఉండట్లేదని తెలిపారు. రాబోయే తరాన్ని మానసికంగా సరైన స్థితిలో ఉంచేలా చూసేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు వెల్లడించారు. సోషల్ మీడియా యాప్స్‌ను తీసుకొస్తున్న టెక్ కంపెనీలు పిల్లల విషయంలో బాధ్యతాయుతంగా ఉండాలని, అన్ని విధాలుగా సహకరించాలని ఆమె కోరారు. యూరప్ దేశాల్లో ఈ నిబంధన అమలు చేస్తే మిగిలిన దేశాలు కూడా అటువైపు అడుగులు వేస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# వేడెక్కిన జమ్ముకశ్మీర్ రాజకీయాలు

**సీఎం ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ రూ.100 కోట్ల పరువునష్టం నోటీస్..**



**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 13**
జమ్మూకశ్మీర్ లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ.. ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీస్ జారీచేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. జుఇవఎబ్అజవ దీత్తుఅష్ట్ర సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు. ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొన్నది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్‌పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టంచేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది. గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టంచేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# సీఈవో పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్న అయోధ్య ట్రస్టు



**అయోధ్య,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామమందిరాన్ని.. శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే టెంపుల్ నిర్వహణ, పరిపాలన కోసం ఆలయ ట్రస్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించనున్నది. దీని కోసం ఆసక్తిగల అభ్యర్థుల నుంచి ఆ ట్రస్టు దరఖాస్తులు కోరుతున్నది. సోషల్ మీడియా అకౌంట్‌లో సీఈవో అర్హత గురించి అయోధ్య ట్రస్టు వివరాలు వెల్లడించింది. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి దరఖాస్తుదారుడు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ఆర్థిక వ్యవహారాల్లో ఆ వ్యక్తికి కనీసం 20 ఏళ్ల అనుభవం ఉండాలని రామజన్మభూమి ట్రస్టు బోర్డు పేర్కొన్నది. దరఖాస్తు చేసుకోవడానికి జూలై 18వ తేదీ గడువు విధించారు. గతంలో ఆలయాలకు ఆర్థిక వ్యవహారాలు నిర్వహించిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. దరఖాస్తుదారుడు కచ్చితంగా హిందూ మత విశ్వాసి అయి ఉండాలి.మరో వైపు అయోధ్య రామాలయంలో నిధులను చోరీ చేసిన కేసులో దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ కేసులో కేంద్రానికి, అయోధ్య ట్రస్టు బోర్డుకు, యూపీ ప్రభుత్వానికి.. సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నిధుల చోరీపై యూపీ సర్కారు ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు బృందం నివేదికను వెల్లడించాలని కూడా సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. సీఈవోగా నియమితుడైన వ్యక్తికి మూడేళ్ల పాటు ఆ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆ వ్యక్తి అయోధ్యలోనే బస చేయాలి. సెలెక్షన్ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుదారులను షార్ట్‌లిస్టు చేస్తారు, ఆ తర్వాత వారికి ఇంటర్వ్యూలను ఏర్పాటు చేయనున్నారు. రామ మందిర నిర్వహణకు పరిపాలనా అధికారిగా సీఈవో ఉంటారని, మిగితా వారంతా ట్రస్టుకు బాధ్యులై ఉంటారని తీర్థక్షేత్ర ట్రస్టు బోర్డు పేర్కొన్నది.

# మూడేళ్ల చిన్నారిపై వ్యక్తి అత్యాచారం..

**- లక్ష జరిమానా విధించిన పంచాయతీ**



**రాంచి ,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
ఒక వ్యక్తి మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే ఈ నేరాన్ని కప్పిపుచ్చేందుకు గ్రామ పంచాయతీ పెద్దలు ప్రయత్నించారు. నిందితుడికి లక్ష జరిమానా విధించారు. అతడు చెల్లించిన కొంత డబ్బుతో మందు పార్టీ జరుపుకున్నారు. (ఘుఅఎష్ఘుఘ్ాబఅఅంష్ట్రఎవత్) ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక గ్రామానికి చెందిన సునీల్ లోహారా, శనివారం సాయంత్రం ఒక ఇంటికి వెళ్లాడు. ఒక మహిళ ఇంటి పనులు చేసుకుంటుండగా ఆమె మూడేళ్ల కుమార్తెను తన వద్ద ఉంచుతానని చెప్పాడు. ఆ తర్వాత ఆ చిన్నారిని మరో గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.కాగా, ఆ బాలిక ఏడ్పు విన్న తల్లి పరుగున వచ్చింది. గాయాలతో ఏడుస్తున్న ఆ చిన్నారిని ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా లైంగిక దాడి జరిగినట్లు బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేయనీయకుండా నిలువరించారు. ఆదివారం గ్రామంలో పంచాయతీ నిర్వహించి నిందితుడికి లక్ష జరిమానా విధించారు. అందులో రూ.20,000 అతడు చెల్లించగా మాంసం, మద్యంతో విందు ఏర్పాటు చేశారు. మిగతా రూ.80,000 వారం రోజుల్లోగా చెల్లించాలని నిందితుడికి సూచించారు. మరోవైపు కొందరు గ్రామస్తుల ద్వారా ఈ విషయం పోలీసులకు తెలిసింది. దీంతో ఘాఘ్రా పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి చిన్నారి తల్లి నుంచి వివరాలు సేకరించారు. ఆమె వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేశారు. కొంత జరిమానా డబ్బుతో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న నిందితుడు సునీల్‌ను అరెస్ట్ చేశారు. అయితే చిన్నారిపై లైంగిక దాడి ఘటన తర్వాత పాల్మా గ్రామంలో ఒక సమావేశం జరిగిందని ఆరంగి పంచాయతీ ప్రెసిడెంట్ లోడో ఎక్కా తెలిపారు. ఆ సమావేశం గురించి తనకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. పోలీసులు గ్రామంలోకి వచ్చిన తర్వాతే దీని గురించి తనకు తెలిసిందని ఆయన అన్నారు.


## అమెరికా సైనిక స్థావరాలపై భీకర ప్రతీకార దాడులు చేశాం : ఇరాన్



**న్యూఢిల్లీ ,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
ఇరాన్ పై అమెరికా జరిపిన తాజా వైమానిక దాడుల కు ప్రతీకారంగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై భారీ క్షిపణి , డ్రోన్ దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఘర్షణల తర్వాత ఇదే తమ అతిపెద్ద ప్రతీకార ఆపరేషన్ అని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వెల్లడించింది. అమెరికా దాడుల్లో బందర్ అబ్బాస్ , ఖెష్మ్ ద్వీపం పరిసరాల్లోని క్షిపణి, వైమానిక రక్షణ వ్యవస్థలు లక్ష్యంగా మారినట్లు సమాచారం.కువైట్, ఖతార్, బహ్రెయిన్, ఒమన్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. కువైట్‌లో అమెరికా పేట్రియాట్ క్షిపణి వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, ఆయుధ నిల్వలను డ్రోన్లతో ధ్వంసం చేశామని తెలిపింది. అలాగే ఒమన్‌లోని డుక్మ్ పోర్టులో అమెరికా నౌకాదళానికి చెందిన సదుపాయాలు, బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, ఖతార్‌లోని అల్ ఉదైద్ ఎయిర్‌బేస్‌పై కూడా దాడులు చేసినట్లు పేర్కొన్నది. జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌లో ఇంధన ట్యాంకులు, మందుగుండు సామగ్రి నిల్వలకు నిప్పు అంటించినట్లు కూడా ప్రకటించింది. దాడులు మళ్లీ జరిగితే మరింత తీవ్రంగా ప్రతిస్పందిస్తామని అమెరికాను హెచ్చరించింది. కాగా, యుద్ధ విమానాలు, నౌకలు, డ్రోన్లతో ఇరాన్‌లోని డజన్ల కొద్దీ లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు అమెరికా ప్రకటించింది. వైమానిక రక్షణ వ్యవస్థలు, తీర ప్రాంత రాడార్లు, క్షిపణి, డ్రోన్ మౌలిక సదుపాయాలు, చిన్న యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. హర్మ్యూజ్ జలసంధిలో పౌర నౌకాయానానికి ముప్పు తగ్గించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు సెంట్‌కామ్ తెలిపింది.

## సేవా కార్యక్రమం కోసం వృద్ధుడి సాహసం..

**91 ఏళ్ల వయస్సులో స్కైడైవింగ్**



**న్యూఢిల్లీ ,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ 91 ఏళ్ల వృద్ధుడు చేసిన సాహసం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. బ్రిటన్ లోని సర్రీ కౌంటీ క్రేన్లీ గ్రామానికి చెందిన 91 ఏళ్ల వృద్ధుడు అలాన్ స్టీల్, సేవా కార్యక్రమాల కోసం నిధులు సేకరించాలనే గొప్ప సంకల్పంతో స్కైడైవింగ్ చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఈ సాహసం ద్వారా ఆయన సుమారు రూ.4.76 లక్షలకుపైగా విరాళాలను సేకరించారు.ఈ మొత్తాన్ని ఆయన 'రోలీస్ కమ్యూనిటీ సెంటర్'కు అందజేశారు. వయసు మళ్లినా ఆయన చూపిన సాహసం, సేవా దృక్పథంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా విమానం నుంచి స్కైడైవింగ్ చేసిన ఆ అద్భుత క్షణాలను తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. 91 ఏళ్ల వయసులో ఈ అరుదైన ఘనత సాధించిన అలాన్ స్టీల్, అప్పుడే తన తదుపరి సాహసానికి సిద్ధమవుతున్నారు. బ్రిటన్‌లోని వేల్స్ ప్రాంతంలో గంటకు 160.9 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే 'జిప్ లైన్' రైడ్‌ను పూర్తి చేయడమే తన తదుపరి లక్ష్యమని చెప్పారు.

## ఉక్రెయిన్ ప్రధాని యులియా రాజీనామా



**కీవ్ ,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
ఉక్రెయిన్ ప్రధాని యులియా స్విరిడెంకో రాజీనామా చేశారు. ఉక్రెయిన్ మంత్రిమండలిలో ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ భారీ మార్పులు చేశారు. దీంతో ఆమె తప్పుకున్నారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ తనకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు ఆమె చెప్పారు. గతంలో ఉక్రెయిన్ ఆర్థిక మంత్రిగా స్విరిడెంకో చేశారు. అయితే 2025 జూలైలో ఆమెకు ప్రధాని బాధ్యతలు అప్పగించారు. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజ ఒప్పందంలో కీలక పాత్ర పోషించినట్లు ఆమెపై గతంలో ఉక్రెయిన్ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. సంక్లిష్ట సమయంలో ఉక్రెయిన్‌కు నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నట్లు స్విరిడెంకో తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.తన తదుపరి కార్యాచరణ గురించి జెలెన్‌స్కీతో చర్చించినట్లు ఆమె తెలిపారు. తన రాజకీయా వ్యూహాన్ని మార్చుతున్నానని, దీనిలో భాగంగా ప్రధాని రాజీనామా చేస్తున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మార్షియల్ చట్టం ప్రకారం జెలెన్‌స్కీ బాధ్యతల నుంచి తప్పుకోలేదు. యుద్ధ సమయంలో ఎన్నికలు నిర్వహించరు కాబట్టి, ఆయన కేవలం తన క్యాబినెట్‌లో మార్పులు చేశారు. పరిపాలనలో కొత్త వారికి అవకాశం కల్పించారు.

## బంగ్లాదేశ్ లో ఎడతెరిపి లేని వర్షాలు.. 51 మంది మృతి



**హైదరాబాద్ ,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
బంగ్లాదేశ్‌లో రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో కనీసం 51 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా కాక్స్ బజార్, చిట్టగాంగ్ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అనేక గ్రామాలు నీటమునిగిపోగా, రహదారి, విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## నాగాలాండ్‌లో ఐఈడీ పేలుడు.. జవాన్ మృతి



**హైదరాబాద్ ,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
ఈశాన్య భారతదేశంలో భద్రతా దళాలపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నాగాలాండ్‌లోని చుమౌకెడిమా పరిధిలో గల సుఖోయ్ ప్రాంతంలో అస్సాం రైఫిల్స్ కాన్వాయ్ సమీపంలో అనుమానిత పేలుడు పదార్థం పేలింది. ఈ ఘటనలో ఒక జవాన్ మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారం రోజుల వ్యవధిలోనే అస్సాం రైఫిల్స్ కాన్వాయ్ లక్ష్యంగా దాడి చేయడం ఇది రెండవసారి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, అనుమానిత ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.

## క్షణాల్లో గుండెజబ్బులను గుర్తించే ఏఐ స్కిన్ ప్యాచ్



**సైటెక్ ,(జర్నలిస్టు డైరీ) జూలై 13**
హార్ట్ ఎటాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో కొన్ని నిమిషాల ఆలస్యం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా షికాగో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అత్యాధునిక ఏఐ స్కిన్ ప్యాచ్‌ను అభివృద్ధి చేశారు. ఈ ప్యాచ్ సెకనులోని వందోవంతు సమయంలోనే గుండె పనితీరును విశ్లేషించి, గుండె సంబంధిత సమస్యలను 99 శాతం కచ్చితత్వంతో గుర్తించగలదని పరిశోధకులు తెలిపారు. ఈ స్కిన్ ప్యాచ్ మృదువైన పలుచని పొరలా ఉండి, శరీరానికి సులభంగా అతుక్కుపోతుంది. ఇందులో అమర్చిన ఆర్గానిక్ ఎలక్ట్రోకెమికల్ ట్రాన్సిస్టర్లు గుండె కొట్టుకునే తీరులో వచ్చే స్వల్ప మార్పులను కూడా వెంటనే గుర్తించి, కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో అదే క్షణంలో విశ్లేషిస్తాయి. ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యులకు హెచ్చరికలు పంపించే సామర్థ్యం దీనికి ఉంది. సాధారణంగా స్మార్ట్‌వాచ్‌లు గుండె స్పందన, నడక వంటి వివరాలను సేకరిస్తాయి. అయితే ఆ సమాచారాన్ని విశ్లేషించడానికి బయటి సర్వర్లపై ఆధారపడాల్సి ఉంటుంది. కానీ ఈ కొత్త ఎఐ స్కిన్ ప్యాచ్ మాత్రం డేటాను పరికరంలోనే అత్యంత వేగంగా విశ్లేషించడం వల్ల స్పందన సమయం గణనీయంగా తగ్గుతుంది. ప్రాణాంతకమైన వెంట్రిక్యులర్ ఫిబ్రిలేషన్ వంటి గుండె స్పందనలో అకస్మాత్తుగా ఏర్పడే ప్రమాదకర మార్పులను ముందుగానే గుర్తించి, సకాలంలో వైద్య సహాయం అందేలా చేయడంలో ఈ పరికరం కీలక పాత్ర పోషిస్తుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ప్రజాస్వామ్యానికి ప్రాణం-ఓటు హక్కే

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన రాజకీయ హక్కు ఓటు హక్కు. అది కేవలం బ్యాలెట్‌పై ముద్ర వేసే అవకాశం మాత్రమే కాదు; అధికారాన్ని ప్రశ్నించే శక్తి, ప్రభుత్వాన్ని మార్చే అధికారం, రాజ్యాంగం ఇచ్చిన సమానత్వానికి ప్రతీక. అందుకే ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం మొదటి బాధ్యత. కానీ ఇటీవల దేశవ్యాప్తంగా చేపడుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై వ్యక్తమవుతున్న సందేహాలు, అభ్యంతరాలు, రాజకీయ వివాదాలు ప్రజాస్వామ్య ఆరోగ్యంపై ఆందోళన కలిగిస్తున్నాయి.భారత రాజ్యాంగంలోని 325, 326 అధికరణాలు మతం, కులం, లింగం, ఆర్థిక స్థితి వంటి కారణాలతో ఎవరికీ ఓటు హక్కు నిరాకరించరాదని స్పష్టంగా పేర్కొన్నాయి. అంతేకాదు, 1988లో జరిగిన 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు వయస్సును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించారు. 1989 ఎన్నికల నుంచే అది అమల్లోకి వచ్చింది. ఆ నిర్ణయం వల్ల కోట్లాది యువత మొదటిసారిగా దేశ రాజకీయ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. నేడు భారత ఎన్నికల వ్యవస్థలో యువ ఓటర్ల పాత్ర అత్యంత కీలకంగా మారింది.



ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం 2024 లోక్‌సభ ఎన్నికల్లో సుమారు 96.9 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికగా అది నిలిచింది. దాదాపు 64 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించారు. ఇంత విస్తృతమైన ఎన్నికల నిర్వహణ ప్రపంచ చరిత్రలోనే అపూర్వమైనది. అయితే అంత పెద్ద వ్యవస్థలో ఓటరు జాబితాల ఖచ్చితత్వం కూడా అంతే కీలకమైన అంశం. మరణించినవారి పేర్లు తొలగించడం, ఒకే వ్యక్తి పేర్లు రెండుచోట్ల ఉంటే సవరించడం, చిరునామా మారిన వారిని నవీకరించడం అవసరమే. కానీ ఆ ప్రక్రియలో నిజమైన ఓటర్లు కూడా జాబితా నుంచి తొలగిపోతే అది కేవలం పరిపాలనా తప్పిదం కాదు; ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనగా మారుతుంది.ఇటీవలి సంవత్సరాల్లో అనేక రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయన్న ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల సంఘం వీటిని సాంకేతిక సవరణలుగా వివరిస్తున్నప్పటికీ, ప్రతిపక్ష పార్టీలు, పౌరసంఘాలు పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఒక ఓటరు తన పేరు జాబితాలో ఉందో లేదో ఎన్నికల రోజునే తెలుసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడితే అది వ్యవస్థ వైఫల్యానికి సంకేతం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కోల్పోవడం అంటే పౌరసత్వానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన హక్కు కోల్పోవడమే.

ప్రత్యేక ఆందోళన కలిగించే అంశం వృద్ధులు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు, గిరిజనులు, దివ్యాంగులు వంటి వర్గాల పరిస్థితి. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, చిరునామా రుజువులు వంటి పత్రాలు అందుబాటులో లేని లక్షలాది మంది ఉన్నారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం దేశంలో అంతర్గత వలస కార్మికుల సంఖ్య 45 కోట్లకు పైగా ఉంది. వీరిలో చాలామంది ఉద్యోగాల కోసం తరచూ ప్రాంతాలు మారుతుంటారు. అలాంటి వారికి ప్రతి సారి పత్రాలు సమర్పించడం సులభం కాదు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా కఠినమైన ధ్రువీకరణ విధానాలు అమలు చేస్తే ఎక్కువ నష్టం సామాన్య పౌరులకే జరుగుతుంది.భారత ఎన్నికల సంఘం ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయ ఎన్నికల సంస్థలలో ఒకటిగా ఎన్నో దశాబ్దాలుగా పేరు సంపాదించింది. కోట్లాది ఓటర్లతో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం చిన్న విషయం కాదు. అయితే విశ్వాసం ఒకసారి దెబ్బతింటే దాన్ని తిరిగి సంపాదించడం చాలా కష్టం. అందుకే ఎన్నికల సంఘం కేవలం నిష్పాక్షికంగా ఉండడమే కాదు, నిష్పాక్షికంగా కనిపించాలి కూడా. ప్రతి సవరణకు కారణం బహిరంగంగా వెల్లడించడం, అభ్యంతరాలు చెప్పేందుకు తగిన సమయం ఇవ్వడం, తిరస్కరణలకు స్పష్టమైన కారణాలు తెలియజేయడం వంటి చర్యలు తప్పనిసరి.సాంకేతికతను ఉపయోగించడం అవసరమే. డిజిటల్ డేటాబేస్‌లు, కృత్రిమ మేధ, భౌగోళిక సమాచార వ్యవస్థలు ఓటరు జాబితాలను మరింత ఖచ్చితంగా రూపొందించగలవు. కానీ చివరి నిర్ణయం మాత్రం మానవీయ దృక్పథంతోనే ఉండాలి. ఒక కంప్యూటర్ పొరపాటు వల్ల ఒక పౌరుడు ఓటు హక్కు కోల్పోతే ఆ నష్టాన్ని సాంకేతిక సమర్థతతో సమర్థించలేం. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి ఆదర్శంగా నిలవడానికి కారణం కేవలం ఎన్నికలు నిర్వహించడం కాదు; ప్రతి అర్హుడికి ఓటు వేసే అవకాశం కల్పించడం. రాజ్యాంగ నిర్మాతలు ఊహించిన ప్రజాస్వామ్యం సంఖ్యల ఆట కాదు; ప్రతి వ్యక్తి గౌరవాన్ని కాపాడే వ్యవస్థ. అందుకే “ఒక అర్హుడి పేరు పొరపాటున తొలగిపోవడం” కంటే “ఒక అనర్హుడి పేరు జాబితాలో ఉండడం” తక్కువ నష్టమని ఎన్నికల న్యాయశాస్త్రం చెప్పే సూత్రం ఇప్పటికీ ప్రాసంగికంగానే ఉంది.ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సవరణల అసలు విజయాన్ని తొలగించిన పేర్ల సంఖ్యతో కొలవలేం. ఒక్క అర్హుడైనా తన ఓటు హక్కును కోల్పోకుండా చూసినప్పుడే ఆ ప్రక్రియ విజయవంతమైందని చెప్పాలి. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అయితే, ఆ పునాదిని బలంగా ఉంచే బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఆ బాధ్యతను పారదర్శకతతో, రాజ్యాంగబద్ధతతో, మానవీయ దృక్పథంతో నిర్వర్తించినప్పుడే ప్రజల విశ్వాసం నిలుస్తుంది; ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం

### 322 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :** శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హాఫీజ్పేట్, చందానగర్ ,భారతి నగర్(పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 322 మంది లబ్ధిదారులకు 3,22,37,352/- మూడు కోట్ల ఇరవై రెండు లక్షల ముప్పై ఏడు వేల మూడు వందల యాభై రెండు రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో యాదవ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, తాజా మాజీ కార్పొరేటర్లు శ్రీ హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి చెక్కుల రూపేణా అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.... ఈ రోజు 322 మంది లబ్ధిదారులకు 3,22,37,352/- మూడు కోట్ల ఇరవై రెండు లక్షల ముప్పై ఏడు వేల మూడు వందల యాభై రెండు రూపాయల విలువ గల కల్యాణ లక్ష్మీ షాది ముబారక్



చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారు అని కొనియాడారు. నిరుపేదల అడా బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా ,మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగినది అని ,అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్ల లో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు,మహిళ సోదరీమణులు మరియు లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# జర్నలిస్టుల హక్కుల సాధనకై పోరు కలెక్టరేట్ ముట్టడించిన టీడబ్ల్యూజేఎఫ్

### త్వరితగతిన అక్రిడిటేషన్ కార్డుల జారీ
### ఉచిత హెల్త్ కార్డుల మంజూరు
### జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు
### ఉచిత ఆర్టీసీ, మెట్రో, రైల్వే పాసుల పునరుద్ధరణ

**వికారాబాద్ జిల్లా(జర్నలిస్ట్ డైరీ)** వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF) వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాడు కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా




టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా అధ్యక్షులు టి. రాంచందర్, జిల్లా కార్యదర్శి ఎండి షఫీలు మాట్లాడుతూ.సమాజ సంక్షేమం కోసం, ప్రజల గొంతుకగా ఎండనక వాననక అహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాకపోవడం విచారకరమన్నారు.గత తెలంగాణ ఉద్యమంలో సైతం ప్రాణాలర్పించిన చరిత్ర జర్నలిస్టులదని, కానీ ప్రస్తుత ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల వల్ల జర్నలిస్టుల హక్కులు కాలరాయబడుతున్నాయని మండిపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అక్రిడిటేషన

# వనిజమైన ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### - కేకే కమిటీని కోరిన షాద్‌నగర్ జేఏసీ నేతలు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :** మహబూబ్నగర్ రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాల చెందిన ఉద్యమకారులతో కేకే కమిటీ సమావేశం జరిగినది. ఈ కమిటీ సమావేశంలో షాద్ నగర్ నుండి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, టియు జెయేసీ సలహాదారులు వెంకట్రాంరెడ్డి మరియు తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు టీ.జి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అధికారిక గుర్తింపు కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు ఉద్యమకారుల అందరికీ 250గజాల ఇంటి స్థలాలు గ్రామీణ ప్రాంతంలో ఒకే దగ్గర ఉద్యమ కారుల కాలనీగా గుర్తించి అక్కడ ఇంటి స్థలాలను కేటాయించాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు. టి జి శ్రీనివాస్ మాట్లాడుతూ కేకే కమిటీ ఉమ్మడి పది జిల్లాల పర్యటించి కుల సంఘాలతో కూడా మాట్లాడాలని కోరారు, నిజమైన ఉద్యమకారులను ఆనాటి జేఏసీ మరియు మీడియా ద్వారా గుర్తించాలని సూచించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం చట్టపరంగా ప్రకటించాలని కేకే కమిటీ ద్వారా ప్రభుత్వానికి విన్నవించాలని కమిటీకి విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి రవికుమార్ గౌడ్ మేకల వెంకటేష్ ముదిరాజ్ మొదలగును వారు పాల్గొన్నారు.

# అంగన్వాడి స్కూల్లో పిల్లలకి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్నగర్ లోని సాయిబాబా కాలనీ అంగన్వాడి స్కూల్లో నీ పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు. కాలనీ కౌన్సిలర్ రాజు నాయక్, కాలనీ పెద్దలు శ్రీరాములు గౌడ్, రిటైర్ కండక్టర్ బాలస్వామి, యూత్ లీడర్ కిరణ్, అంగన్వాడీ టీచర్ ప్రసన్న, ఏఎన్ఎం మల్లికా మరియు కాలనీవాసులు, పిల్లల తల్లులు మొదలు వారు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### - కేశంపేట మండల లబ్ధిదారులకు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో ఆయన సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కేశంపేట మండలంలోని దత్తాయిపల్లి గ్రామానికి చెందిన టీ తరుణ్, తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన రాజమోని అంజమ్మ, బట్టిని యదయ్య, గోస్కె నర్సిములు, కోనాయపల్లి గ్రామానికి చెందిన ఢిల్లీ లక్ష్మమ్మ, లెమ్మమిడి గ్రామానికి చెందిన దిద్దెల శంకరమ్మ, అల్వాల్ గ్రామానికి చెందిన కుమ్మరి అంతయ్య, సంతాపూర్ గ్రామానికి చెందిన ఎద్దు ప్రణతితో పాటు పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగంధన సర్పంచ్ నాగిల వెంకట్, కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పంతులు, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాంద్ర విష్ణువర్ధన్ రెడ్డి, తొమ్మిదిరేకుల మాజీ సర్పంచ్ బాలరాజ్ గౌడ్, లెమ్మమిడి డిప్యూటీ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, మాజీ డిప్యూటీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ యదయ్య, బీఆర్ఎస్ నాయకులు మహేష్, యాదయ్య, షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు దినేష్ సాగర్, కోనాయపల్లి బీఆర్ఎస్ యువ నాయకుడు శశినేత, విలేజ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సంతోష్ రెడ్డి, ఎస్. మహేష్, అల్వాల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలి

**-16వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్**

**-ఎన్యుమరేషన్ ఫారమ్‌లను తప్పనిసరిగా సమర్పించాలి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు క్రిస్టియన్ కాలనీ కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా తన ఎన్యుమరేషన్ ఫారమ్‌లను ఈరోజు సంబంధిత బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలకు) సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవడం తమ బాధ్యతగా భావించాలని అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారమ్‌లను నింపి సమర్పించాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడానికి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

**- డాక్టర్ అమూల్య ప్రియదర్శిని**



**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 13:-**
వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో నులిపురుగుల నివారణలో భాగంగా సోమవారం దౌల్తాబాద్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆల్బండోజల్ మాత్రలను వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నులిపురుగుల నివారణతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారాని ఇట్టి మాత్రల గురించి విద్యార్థులకు అవగాహనా ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న ప్రతి పాఠశాల,అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థుల అందరికీ మాత్రలు పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వసంత, సూపర్ వైజర్ రఫీ, ఏఎన్ఎమ్ లు అనిత, అనురాధ పాల్గొన్నారు.

# షాద్‌నగర్ టీయూజేఏసీ నూతన అధ్యక్షుడిగా టీజీ శ్రీనివాస్‌కు ప్రొఫెసర్ కోదండరాం అభినందనలు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :**
షాద్‌నగర్ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక (టీయూజేఏసీ) నూతన అధ్యక్షుడిగా ఉద్యమకారుల ఏకగ్రీవ నిర్ణయంతో ఎంపికైన టీజీ శ్రీనివాస్ సోమవారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం టీజీ శ్రీనివాస్‌ను అభినందిస్తూ, తెలంగాణ ఉద్యమకారులందరినీ ఐక్యవేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఉద్యమకారుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి అందరినీ కలుపుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం టీయూజేఏసీ అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ కోదండరాం స్వయంగా అభినందించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. తనపై ఉద్యమకారులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.'

# జీవో నెం.641ను వెంటనే రద్దు చేయాలి

**-కొత్త పరిశ్రమలు కోడంగల్ కు! 'చెత్త' పరిశ్రమలు షాద్నగర్ కా?**

**-డంపింగ్ యార్డ్ కోడంగల్ లో ఏర్పాటు చేయాలి..**

**-బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి డిమాండ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 641ను వెంటనే రద్దు చేయాలని బీజేపీ కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండిస్తున్న సారవంతమైన భూముల మధ్యలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, భూగర్భ జలాలు, పశుసంపద, వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నప్పటికీ వారి అభిప్రాయాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, ఇప్పుడు ప్రజలపై డంపింగ్ యార్డ్ భారాన్ని మోపాలని ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించి జీవో 641ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలనే అంత ఆసక్తి ఉంటే, ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే ఏర్పాటు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, రైతులు, యువతతో కలిసి పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిద్ధాపూర్ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

# జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించిన

**అగ్గునూరు బసవేశ్వర్ మున్సిపల్ చైర్మన్**

**డాక్టర్ వి.విజయలక్ష్మి**

**డిప్యూటీ డి ఎం ఎం హెచ్ ఓ**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ):**
ఫరూక్ నగర్ మండలంలోని హైస్కూల్లో ఏర్పాటుచేసిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్ మరియు డాక్టర్ విజయలక్ష్మి డిప్యూటీ డిఎంహెచ్ఓ వచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నులి పురుగులు అనేవి మనిషించే పరామర్ జీవులని ఇవి కల్పితమైన ఆహారము నీరు పరిస్థితి లేకపోవడం చెప్పులేకుండా నడవడం వంటి కారణాలవల్ల శరీరంలో ప్రవేశిస్తాయని ఇవి ఐదు రకాలు ఉంటాయని గుండ్రపు పురుగు కొంకి పురుగు దారపు పురుగు బద్దె పురుగు అని డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు ఈ నులి పురుగులు పిల్లల కడుపులో ఉండటం వల్ల పిల్లలు తీసుకునే హారమావి భుజించి పిల్లల యొక్క అనారోగ్యానికి గురి చేస్తాయని తెలియజేశారు అందువలన ప్రతి సంవత్సరము ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోళ్ళు మాత్ర వేసుకున్నట్లయితే ఈ నులిపురుగులను నివారించవచ్చని తెలియజేశారు. ఈ మాత్రలు ఒకటి నుండి 19 సంవత్సరంలో పిల్లలందరూ కూడా ఈ మాటలు తప్పనిసరిగా వేసుకోవాలని డాక్టర్ బి విజయలక్ష్మి చెప్పారు. తదుపరి మున్సిపల్ చైర్మన్ అగ్గునూరి బసవేశ్వర్ మాట్లాడుతూ పిల్లల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే, ఇవి పిల్లలను అనారోగ్యం బారిన పడతారు అని, అప్పుడు పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంపై ప్రభావితం చూపిస్తాయని, కాబట్టి వాటి నిర్మూలనకు అందరూ పిల్లలు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని మున్సిపల్ చైర్మన్ అగ్గునూరి బసవేశ్వర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గునూరి బసవేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందేమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్లు దిలీప్, పెంటయ్య, కోప్పునూరి ప్రవీణ్ , బచ్చలి నరేష్ , రాజు నాయక్, మండల విద్యాధికారి మనోహర్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి .విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్, సోలిపూర్ అనిల్, ముబారక్ అలీ ఖాన్, మాధవులు యాదవ్, సత్తయ్య , పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, సీనియర్ స్కూల్ అసిస్టెంట్ తిరుపతిరెడ్డి, ఏ రాజశేఖర్ రెడ్డి , విష్ణువర్ధన్ ఎన్. సి . సి. ఆఫీసర్ రాజేశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్, మరియు ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# ఆరుగురిని హత్య చేసిన నరహంతకుడు రాజ్‌కుమార్ మరణించాడు.

**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలాన్ని వనికించిన ఆరు హత్య కేసుల ఉదంతం**

**సంచలనంగా మారిన ఆరు హత్యల ను సవాల్ గా తీసుకున్న పోలీస్ డిపార్ట్మెంట్**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :**
జూలై 10న భార్యాపిల్లలతో సహా ఆరుగురిని నరరూప రాక్షసుడిలా గొంతుకోసి చంపేసి, ఆ తర్వాత పరారైన రాజ్‌కుమార్ తన మేనమామ ఊరైన కొత్తూరు మండలం పంజర్లలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. జూలై 10 న అర్ధరాత్రి ఆరుగురిని చంపిన తర్వాత నిందితుడు రాజ్‌కుమార్ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. అతడి కోసం 12 పోలీస్ బృందాలు తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలోనే పంజర్లలో మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యమైంది.

**అసలు ఏం జరిగిందంటే?**

తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో జూలై 10 అర్ధరాత్రి మూడు వేర్వేరు ప్రాంతాల్లో దారుణానికి ఒడిగట్టాడు. మొదట షాబాద్ టౌన్‌లో మైనర్ బాలిక తల్లి, నాయనమ్మ లను నరికి చంపాడు. ఆపై సదరు మైనర్ బాలిక ను అఖిల్ సాగర్ చెరువు వద్దకు తీసుకెళ్లి గొంతుకోశాడు. అనంతరం తన ఇంటికి వెళ్లి భార్య, కొడుకులను సైతం కిరాతకంగా మట్టుబెట్టాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. పోలీసులు సైతం కేసును సవాల్‌గా తీసుకుని నిందితుడి కోసం తీవ్ర గాలింపు చేపట్టారు.

**హత్య చేసిన తర్వాత తన తండ్రికి ఫోన్**

ఆరుగురిని చంపిన తర్వాత "నేను కూడా చనిపోతున్నా" అని తండ్రికి ఫోన్ చేసిన రాజ్‌కుమార్, తిమ్మాపూర్ రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్య డ్రామా ఆడి తప్పించుకున్నాడు. అతడిని పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు జారీ చేసి, రూ.2 లక్షల రివార్డు కూడా ప్రకటించారు. అయితే పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్న నిందితుడు చివరకు కొత్తూరులో శవమై తేలడంతో ఈ సంచలన కేసులో ఒక ప్రధాన ఘట్టం ముగిసిందని చెప్పొచ్చు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడుదాం..!

**-జర్నలిస్టులపై రాజకీయాలు చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్..**

**-మీడియాపై ఇలాంటి వివక్ష ఎప్పుడు చూడలేదు..**

**-ముఖ్యమంత్రిని బదనాం చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి**

**-టిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య..**

**-ఈ సుద్దపూసల బండారం బయటపెట్టాలి - జర్నలిస్ట్ కేపీ**

**-గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేని ప్రభుత్వాలు సిగ్గుపడాలి - జిల్లా అధ్యక్షుడు గణేష్..**

**-రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు "టిడబ్ల్యూజెఎఫ్" జర్నలిస్టుల ఆందోళన**

**-కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు**






**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :** సమాజంలో ఉన్న సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నాం.. ఇప్పుడు పోరాడే జర్నలిస్టులే సమస్యల్లో పడ్డారు.. అయినా వదిలి పెట్టేది లేదు.. మనకోసం మనమే పోరాడుదాం.. గల్లి నుంచి ఢిల్లీ దాకా మన పోరాటాన్ని కొనసాగిద్దాం.. అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అక్కడికి చేరుకొని కార్యాలయ గేటు ముందు ఆందోళన నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లాకు అధ్యక్షుడు శేరీబాయి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవేందర్, ఎండి ఖాజాపాషా కేపి, శ్రీనివాసచారి, చంద్రశేఖర్, మన్సూర్ అలీ ఖాన్, శ్రీశైలం, నరసింహారెడ్డి, రాజశేఖర్ తదితరులతో పాటు షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, అమన్ గల్, శంషాబాద్, చేవెళ్ల, శంకర్ పల్లి, షాబాద్, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట్ తదితర ప్రాంతాల నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా అక్రిడేషన్ కార్డు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు తదితర విషయాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య మాట్లాడుతూ.. చిన్న సమస్యల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి జర్నలిస్టులకు ఏర్పడుతుందని, ఇది అత్యంత దారుణమని అన్నారు. ఇదంతా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆడిస్తున్న నాటకం అని, దీనిపై ప్రశ్నించడానికి వెళితే కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ తీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బదనాం చేస్తుందని ఆరోపించారు. ఎలాంటి సమస్యలనైనా తమ వార్తల ద్వారా తెలియజేసే జర్నలిస్టులు చిన్న సమస్యల కోసం పోరాడాల్సిన దుస్థితి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఎదుర్కొంటున్నామని అన్నారు. 40 ఏండ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ రైల్వే పాసు సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడేందుకు త్వరలో జర్నలిస్టులు ఢిల్లీ వెళ్లాల్సి ఉందని తెలిపారు.

ఇక్కడ గల్లి అయిన అక్కడ ఢిల్లీ అయినా టిడబ్ల్యూజేఎఫ్ ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కొన్ని జర్నలిస్టు యూనియన్లు రాజకీయ పార్టీలలా వ్యవహరిస్తూ జర్నలిజంలో రాజకీయాలు తెచ్చి విభజించి పాలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రిని, మంత్రి పొంగులేటిని కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. జర్నలిస్టులకు రైలు, మెట్రో రైలులో కూడా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశామని తెలిపారు. అలాగే విద్య, వైద్యం విషయంలో సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్నారు.

**తీగ లాగుతాం.. డొంక కదిలిస్తాం..**

టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేపీ

కొంతమంది అధికారులు అంతా రూల్స్ ప్రకారమే వెళుతున్నామని బిల్డప్పులు ఇస్తున్నారు.. కానీ చదువురాని వాళ్లకు కూడా గుర్తింపు కార్డులు జారీ చేశారనీ, కానీ దశాబ్దాలుగా జర్నలిస్టులుగా పని చేస్తున్న వారిని మాత్రం పక్కన పెట్టారన్నారు. దీనిని వదిలిపెట్టేది లేదు.. తీగలాగితే డొంక కదిలిస్తాం.. అని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జర్నలిస్ట్ కేపీ అన్నారు. జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అక్రిడేషన్ గుర్తింపు కార్డుల విషయంలో ఇంత దారుణాన్ని ఇప్పటిదాకా చూడలేదని, జర్నలిస్టులను పనిగట్టుకొని కొందరు వెంటాడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని వారికి ఎంతమందికి అక్రిడేషన్ కార్డులు ఇచ్చారు ఆ జాబితా తమ వద్ద ఉన్నాయని త్వరలోనే అక్రిడేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అన్ని వివరాలు బయటపెడతామని హెచ్చరించారు. దీనిపై కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుద్దపూసల వ్యవహరిస్తున్న అధికారుల బండారాన్ని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. నిరంతరం వార్తల ద్వారా ప్రజల్లో ఉండి సేవలు అందిస్తూ, నాయకులకు ప్రచారం కల్పించే జర్నలిస్టుల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. చాలామంది జర్నలిస్టులను కార్డులు ఇవ్వకుండా వేధిస్తున్న ఈ తీరుపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస అవగాహన లేని, అక్షరం ముక్క రాయలేని జర్నలిస్టులకు కార్డులు ఇచ్చారు.. ఇంగ్లీషు రాయడం చేతకాని జర్నలిస్టులకు ఆంగ్ల పత్రికల్లో కార్డులు ఇచ్చారు.. ఫీల్డ్ కు సంబంధం లేని వారికి కూడా కార్డులు ఇచ్చారని, కానీ దశాబ్దాలుగా అంకితభావంతో సేవలు అందిస్తున్న జర్నలిస్టులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాడి హక్కులను సాధించుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు.

**జర్నలిస్టును గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలి..**

టియుడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్ సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులను గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ప్రక్రియలో పూర్తిస్థాయిలో పక్షపాత ధోరణి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. దీనిపై ప్రజాస్వామ్య యుతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను చూసి వారి తరఫున ప్రచారం చేసి గెలిపిస్తే గెలిచాక జర్నలిస్టులను పూర్తిగా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం, వైద్య సదుపాయం కల్పించడం, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య లక్ష్యంగా ఈ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. సూర్య దినపత్రికను అదేవిధంగా మరికొన్ని దినపత్రికలను కక్షపూరిత ధోరణిలో పక్కన పెట్టారని ఇదంతా యూనియన్ల రాజకీయమని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుందని ఎల్లప్పుడూ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి ఉండడని అవకాశం మాకు కూడా వచ్చినప్పుడు తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఇంతకు మునుపు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు అన్నారు. హైదరాబాదులో ఈ నెల 15వ తేదీన జరిగే ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల జర్నలిస్టులు రఘు, నరేష్, గోపాల్, బుచ్చన్న, యాదగిరి, జగన్, నరసింహ, సురేంద్ర, శంకర్, కస్తూరి రంగనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి, రాకేష్, కృష్ణ, ధరశీపాల్, శివ కుమార్, నరేందర్ గౌడ్, రామకృష్ణ, శ్రీకాంత్, ఆవుల రమేష్, శంకర్, చంద్రశేఖర్ గౌడ్, షకీల్, రియాజ్, ఖాలేద్ శ్యామ్ కుమార్, బూర్గుల రమేష్, మంచలం రమేష్, బండి గోపాల్, సత్యనారాయణ, రవి, రాజు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల తొలి బోనాల జాతరకు ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్:(జులై 13) జర్నలిస్ట్ డైరీ..** తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల తొలి బోనాల జాతర సందర్భంగా మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కుమ్మర సంఘం పెద్దలు, బోనాల జాతర ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆడాల గణేష్ ఆధ్వర్యంలో ఎంపీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతరను ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్ల గురించి వివరించి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కుమ్మరుల సమాజాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన ఎంపీ ఈటల రాజేందర్, కుమ్మరుల సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే ఈ బోనాల జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## తెలుగు విశ్వవిద్యాలయ రిలే నిరాహార దీక్షలు..

**- జ్యోతిష విభాగ విద్యార్థుల వినూత్న నిరసన**



**హైదరాబాద్: (జులై 13) జర్నలిస్ట్ డైరీ.** తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జ్యోతిషం మరియు వాస్తు విభాగం విద్యార్థులు, అధ్యాపకులు వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలో నెలకొన్న పరిస్థితులను జ్యోతిష శాస్త్ర దృష్టికోణంలో విశ్లేషిస్తూ వారు ప్రసంగాలు నిర్వహించారు. గ్రహగోచారాల పరంగా తాత్కాలిక ఆటంకాలు, సవాళ్లు ఎదురైనా తెలుగు విశ్వవిద్యాలయానికి ఎలాంటి అపాయం లేదని, ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం కూడా త్వరలోనే తొలగిపోతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న వారు, నాంపల్లి క్యాంపస్‌ను కాపాడుకునే వరకు, తమ డిమాండ్లకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పూర్వ విద్యార్థులు, తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. నాంపల్లి క్యాంపస్ పరిరక్షణ కోసం కొనసాగుతున్న ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు సత్యనారాయణ, ఫణీంద్ర, నరసింహ చారి, ప్రతిభ ,విద్యార్థులు ఆదిత్య, రాజేంద్ర ప్రసాద్, ఆర్య, ప్రకాష్, అరుణ, శారద తదితరులు పాల్గొన్నారు

## మేడ్చల్ నియోజకవర్గం లో జరిగే సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి..!

**-సీఎం రేవంత్ రెడ్డి గారి ప్రజా పాలన గురించి వివరించండి**

**-పార్టీ శ్రేణులతో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్**



**నాగారం, జూలై 13:-(జర్నలిస్ట్ డైరీ)** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా మేడ్చల్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమం అన్ని వర్గాల ప్రజలకు అందుతుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని మేడ్చల్ డివిజన్ కు చెందిన కనకాల శివ కుమార్ (బిపిటి రాజు)కి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామక పత్రాన్ని మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక పేద కుటుంబానికి ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి నేటి వరకు రేషన్ కార్డుల పంపిణీ నిరంతరంగా సాగుతుందన్నారు. దీంతో లక్షల మంది పేదలు లబ్ధిపొందుతున్నట్టుగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ కుమార్ యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ అయూబ్ ఖాన్ (యూసుఫ్), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు కురుమ, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు వెంకట్ రాంరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జాకట దేవరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోనె మహేందర్ రెడ్డి, నడికొప్పు రంజిత్ ముదిరాజ్, సింగరేణి పోచయ్య, సద్ది సుదర్శన్ రెడ్డి, పాలకుర్తి రాఘవేందర్ గౌడ్, సద్ది ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నాగారం డివిజన్ ప్రజలందరు సర్ లో పాల్గొనాలి..కాంగ్రెస్ పార్టీ....



**నాగారం, జూలై 13:-(జర్నలిస్ట్ డైరీ)** ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ త్వరలో ముగియనున్నందునఎన్యూమరేషన్ ఫార్ములు తీసుకున్న ప్రతి ఒక్కరూ వెంటనే వాటిని పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేసారు. మీరు తీసుకున్న ఎన్యూమరేషన్ ఫార్మ్ పైభాగంలోనే మీ బీఎల్ఓ పేరు మరియు ఫోన్ నంబర్ ఉంటాయని, కాబట్టి సంబంధిత బీఎల్ఓను సంప్రదించి, మీరు నింపిన ఫార్మ్‌లను రెండు రోజుల్లోపు తప్పనిసరిగా సమర్పించండి. ఒకవేళ మీరు ఇంకా ఫార్మ్ తీసుకోకపోయినా లేదా మీ ఓటు ఏ బూత్‌లో ఉందో తెలియకపోయినా, వెంటనే ఈసిఐ నెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఓటర్ లిస్ట్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలన్నారు. అందులో మీ ఇపిక్ నెంబర్ (ఓటర్ ఐడి నెంబర్) లేదా ఇతర వివరాలను నమోదు చేస్తే మీ బూత్ నంబర్ మరియు సంబంధిత బీఎల్ఓ వివరాలు తెలుస్తాయని వివరించారు. ఆ తర్వాత మీ బీఎల్ఓను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫార్మ్‌ను తీసుకొని, పూర్తిగా నింపి రెండు రోజుల్లోపు సమర్పించాలని కోరారు. ఫార్మ్‌ను సమర్పించని పక్షంలో మీ ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఓటరు, ప్రతి కుటుంబం ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, తమ ఓటు హక్కును కాపాడుకోవాలని మనవి చేస్తున్నాము. మీ ఓటు -- మీ హక్కు, మీ బాధ్యత. ఎన్యూమరేషన్ ఫార్మ్‌ను వెంటనే నింపి మీ సంబంధిత బీఎల్ఓకు అందజేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## నాగారం డివిజన్ లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్

- ఘట్‌కేసర్ సర్కిల్, ఎంఎంసీకి వినతిపత్రం....



**నాగారం, జూలై 13:-(జర్నలిస్ట్ డైరీ)** నాగారం డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి, గత వినతిపత్రాలపై తీసుకున్న చర్యల వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాని నాగారం తెలంగాణ రాజ్యాధికారం పార్టీ నాయకులు అందజేసారు. నాగారం డివిజన్ ప్రజల తరఫున ఈ వినతిపత్రాన్ని సమర్పిస్తున్నామని. గతంలో ప్రజావాణి ద్వారా మరియు సంబంధిత అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, ఇప్పటికీ అనేక సమస్యలు పరిష్కారం కాలేదని. అలాగే గతంలో సమర్పించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలు కూడా తెలియజేయాలని వారు కోరారు. కాగా క్రింద సూచించిన సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరుతున్నారు. నాగారం--ధమ్మాయిగూడ ప్రధాన రహదారి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి గుంతలను తొలగించి ప్రమాదాలను నివారించాలి. శిథిలావస్థలో ఉన్న ప్రజా మూత్రశాలలను పునరుద్ధరించి, గత ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలి.

డ్రైనేజీ, మురుగునీటి పారుదల సమస్యలను పరిష్కరించాలి. అంతర్గత రహదారులు, వీధి దీపాలు, తాగునీటి లీకేజీలు, చెత్త సేకరణ, ఫాగింగ్, ప్రమాదకర మ్యాన్‌హోల్స్ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. గతంలో ప్రజావాణి ద్వారా సమర్పించిన అన్ని వినతిపత్రాలపై తీసుకున్న చర్యల పూర్తి వివరాలను లిఖితపూర్వకంగా అందించాలని వారు కోరారు. పై సమస్యలపై నిర్దిష్ట గడువుతో చర్యలు తీసుకొని, వాటి పురోగతిని మాకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని వారు కోరుతున్నారు. లేనిపక్షంలో సమాచార హక్కు చట్టం మరియు ఇతర చట్టబద్ధ మార్గాల ద్వారా న్యాయం కోరాల్సి వస్తుందన్నారు.

## ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శివాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



**యాచారం (జులై 13) జర్నలిస్ట్ డైరి.** సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా యాచారం మండలం నంది వనపర్తి గ్రామంలోని శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో అన్నాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, బిల్వదళ పూజలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని శివుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం "ఓం నమః శివాయ" నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో సోమ సత్యనారాయణ లక్ష్మి,రామదాసు మాధవాచారి అరుణ మరియు గ్రామస్తులుపాటు గ్రామ పెద్దలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## ప్రతి ఒక్క రెస్టారెంట్,షాపింగ్ మాల్ లో సి సి కెమేరాలు తప్పనిసరి



**నాగారం, జూలై 13:-(జర్నలిస్ట్ డైరీ)** కీసర ప్రధాన కూడలిలో ఉన్న అంజనాస్ కిచెన్ రెస్టారెంట్ లో సి సి కెమరాలను సోమవారం జవహర్ నగర్ ఎసిపి చక్రపాణి ప్రారంభించారు. అనంతరం అట్టి ఎనిమిది సి సి కెమేరాలను కీసర పోలీస్ స్టేషన్ కి జియో ట్యాగ్ చేయడం జరిగింది. ఈ సంధర్బంగా ఎసిపి చక్రపాణి మాట్లాడుతూ రద్దీ ఉన్న ప్రాంతాల్లో రెస్టారెంట్స్ కానీ షాపింగ్ మాల్స్ లో సి సి కెమేరాలు తప్పని సరి ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి కెమెరాను జియో ట్యాగ్ కూడా చేయించుకోవడం తప్పనిసరి అన్నారు. పని చేసే కార్మికుల వివరాలు సైతం మీ సురక్ష యాప్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కీసర సిఐ అర్కపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై అసత్య ప్రచారం మానుకోవాలి

**-కాగితాలు కాదు... గ్రామాల్లోకి వెళ్లి అభివృద్ధిని చూడండి**

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :** ఇటీవల మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు "మండలాలు ఏర్పాటు చేశారు కానీ అభివృద్ధి చేయలేదు" అని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త మండలాలు, కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసింది. దశలవారీగా కలెక్టరేట్ భవనాలు, జిల్లా వైద్య కళాశాలలు, గ్రామపంచాయతీ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. కరోనా వంటి క్లిష్ట పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఆగకుండా కొనసాగించింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో నందిగామ, జిల్లేడు చౌదరిగూడెం మండలాలు ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలే ప్రత్యక్షంగా చూశారు. మండల కేంద్రాల్లో సీసీ రోడ్లు, గ్రామాలకు బీటీ రోడ్లు, కొత్తూర్--షాద్‌నగర్ రహదారి అభివృద్ధి, అనేక గ్రామీణ మౌలిక సదుపాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. ఎమ్మెల్యే శంకర్ గారు "కాగితాలు మాత్రమే తీసుకొచ్చారు, పనులు జరగలేదు" అని వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరం. కాగితాల గురించి మాట్లాడే ముందు ఒక్కసారి గ్రామాల్లోకి వెళ్లి కళ్లారా అభివృద్ధి పనులు చూసి మాట్లాడండి. ఇప్పుడు మీరు రెండు బీటీ రోడ్లు తీసుకొచ్చి "మొత్తం అభివృద్ధి అంతా మేమే చేశాం" అని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే. మీరు చేసిన పనులను ప్రజలు స్వాగతిస్తారు. కానీ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వేలాది కోట్ల రూపాయల అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, అంతా ఇప్పుడు మాత్రమే జరుగుతోందని ప్రచారం చేయడం సబబు కాదు. 2014కు ముందు పరిస్థితులు ఎలా ఉండేవో, బీఆర్ఎస్ పాలనలో ఎన్ని బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు, అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలే చెబుతారు. అయితే గతంలో జరిగిన అభివృద్ధిని పూర్తిగా కాదని, "ఏమీ జరగలేదు" అనే విధంగా మాట్లాడటం ప్రజల విజ్ఞతను అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద నిరసన

**- హామీలను నెరవేర్చాలని ప్రభుత్వానికి విన్నపం**

కార్డులు మంజూరు చేయాలని, అక్రిడిటేషన్ కమిటీలలో అన్ని జర్నలిస్ట్ సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చి, ఆ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని కోరారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే, జర్నలిస్టులకు ఉచిత ఆర్టీసీ, మెట్రో పాసులు జారీ చేయాలని, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన రైల్వే పాసులను పునరుద్ధరించేలా మోడీ సర్కార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాత్రి సమయాల్లో విధులు ముగించుకుని వెళ్లే మహిళా జర్నలిస్టుల భద్రత కోసం ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ మాసాని వెంకటయ్య, కోశాధికారి ప్రశాంత్, ఉపాధ్యక్షులు హాఫీజ్, భీమ్ శాప్ప, శ్రీనివాస్, అనంతయ్య, మురళి గుప్త, కృష్ణ, ఉదయ్, కార్యదర్శులు ఏ. ఆనంద్, ఎజాజ్, జి శ్రీనివాస్, కృష్ణ, అరుణ్ రెడ్డి, నాగిరెడ్డి, జగన్, శ్రీకాంత్, రాకేష్, సంతోష్, అరుణ్ పోతురాజు విష్ణువర్ధన్ తదితర నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో 'జక్కిడి' మంటలు

- **సీనియర్ నాయకురాలు, యాదగిరిగుట్ట ఆలయ ట్రస్టు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు**
- **యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం**
- **ఎల్బీనగర్ లో భగ్గుమన్న బీసీ సంఘాలు**
- **విజయవాడ జాతీయ రహదారిపై రాస్తారోకో, శివచరణ్ రెడ్డి ఇంటి ముట్టడి, పోలీసుల లాఠీఛార్జ్**
- **క్షమాపణ చెప్పకపోతే గాంధీ భవన్ ముట్టడిస్తాం**







**ఎల్బీనగర్, జులై 13 (జర్నలిస్ట్ డైరీ) :** యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి బీసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆడియో క్లిప్ లు బయటి రావడంతో బీసీ సంఘాల భగ్గుమన్నాయి. ముఖ్యంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలైన ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ కు చెందిన ఈశ్వరమ్మ యాదవ్ ను అసభ్యం వ్యాఖ్యలు చేశారని బీసీ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈశ్వరమ్మకు మద్దతుగా యాదవ, పద్మశాలి, ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు సోమవారం మన్సూరాబాద్ డివిజన్ లోని ఈశ్వరమ్మ ఇంటి వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేసి, శివచరణ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం శివచరణ్ రెడ్డి ఇంటిని ముట్టడించారు. ఈ క్రమంలో శివచరణ్ రెడ్డి, ఈశ్వరమ్మ మద్దతుదారుల మధ్యన రాళ్లదాడి చోటు చేసుకోవడంతో పోలీసులు ఇరువర్గాలను లాఠీఛార్జ్ చేసి, చెదరగొట్టారు. ముందుగా జరిగిన సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మాట్లాడారు.

**ఎల్బీనగర్ రింగ్ రోడ్డులో బేషరతుగా క్షమాపణ చెప్పాలి**

బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్ పై యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అగ్రవర్ణాల దురహంకారానికి నిదర్శనమన్నారు. రెడ్డి నాయకులు బీసీ నాయకులను రాజకీయంగా ఎదగకుండా మానసికంగా, పార్టీపరంగా వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వెంటనే జక్కిడి శివచరణ్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలని సూచించారు. వృద్ధురాలైన సీనియర్ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్ కు సీఎం రేవంత్ రెడ్డి చిన్న నామినేటెడ్ పదవి ఇస్తే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓసీ నాయకుడు ఓర్వలేరా? అని ప్రశ్నించారు. మహిళలపట్ల గౌరవాన్ని పాటించాలని సూచించారు. ఈశ్వరమ్మ యాదవ్ పై అనుచిత వ్యాఖ్యలు తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దీంతో 10 కి.మీ భారీగా ట్రాఫిక్ జామై వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## భార్య మృతిని తట్టుకోలేక శశిలేటి వాగు బ్రిడ్జిపై నుంచి దూకిన యువకుడు

**గుర్రంపోడు, జూలై 13 (జర్నలిస్ట్ డైరీ) :** గుర్రంపోడు మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం విషాదకర ఘటన చోటుచేసుకుంది. భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు శశిలేటి వాగు బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల కథనం మేరకు, చామలేడు గ్రామానికి చెందిన చిలువేరు నవీన్ తీవ్ర ఆవేదనతో గుర్రంపోడు సమీపంలోని శశిలేటి వాగు బ్రిడ్జిపై నుంచి కిందకు దూకాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, తీవ్రంగా గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాగా, కొద్దిరోజుల క్రితం నవీన్ భార్య కూడా ఇదే శశిలేటి వాగు బ్రిడ్జిపై నుంచి పడిపోయి మృతి చెందిన విషయం తెలిసిందే. భార్య మరణించిన ప్రదేశంలోనే నవీన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. నవీన్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు



తెలియాల్సి ఉంది.


జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక



## ఆశికా రంగనాథ్ గ్లామర్ షో..

## వారణాసి’లో చిన్ననాటి మహేష్‌గా అభయ్ రామ్ ..

### రాజమౌళి సినిమాపై వైరల్ అవుతున్న కొత్త టాక్!




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ వరల్డ్ చిత్రం ‘వారణాసి’పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ అడ్వెంచర్ డ్రామా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. అయితే ఈ సినిమాకు సంబంధించి తరచూ ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా మరో ఆసక్తికర ప్రచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజా టాక్ ప్రకారం, జూనియర్ ఎన్టీఆర్ కుమారుడు అభయ్ రామ్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారనే వార్త వైరల్ అవుతోంది. అంతేకాదు, సినిమాలో మహేష్ బాబు చిన్ననాటి పాత్రను అభయ్ రామ్ పోషించనున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, సినిమాలో చిన్న మహేష్ పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉంటుందట. ఆ పాత్రకు కావాల్సిన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని రాజమౌళి ప్రత్యేకంగా అభయ్ రామ్‌ను ఎంపిక చేయాలని భావించారనే ప్రచారం జరుగుతోంది. రాజమౌళి, ఎన్టీఆర్ మధ్య ఉన్న సన్నిహిత అనుబంధం కారణంగా ఈ ప్రతిపాదనకు ఎన్టీఆర్ కూడా వెంటనే అంగీకరించారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రాజమౌళి తన సినిమాలకు సంబంధించిన వివరాలను పూర్తి గోప్యంగా ఉంచడం తెలిసిందే. ముఖ్యంగా ‘వారణాసి’ వంటి భారీ ప్రాజెక్ట్ విషయంలో ఒక్కో అప్డేట్‌ను కూడా సరైన సమయం వచ్చిన తర్వాతే వెల్లడించే అవకాశం ఉంది.చేవషం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ నటనతో ప్రేక్షకులను అలరిస్తుండగా, ఇప్పుడు ఆయన కుమారుడు కూడా వెండితెరపై కనిపిస్తే చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, మహేష్ బాబు చిన్ననాటి పాత్రలో అభయ్ రామ్ కనిపిస్తే అది సినిమా హైలైట్‌గా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక కొందరు అభిమానులు మరో ఆసక్తికర పోలికను కూడా తెరపైకి తీసుకొస్తున్నారు. గతంలో మహేష్ బాబు కుమారుడు గౌతమ్ కృష్ణ వెండితెరకు పరిచయమైన సందర్భాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు అభయ్ రామ్‌ను రాజమౌళి పరిచయం చేస్తే అది నందమూరి అభిమానులకు ప్రత్యేక క్షణంగా నిలుస్తుందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

## ఆ సమస్యలతో బాధపడుతున్నా..

### అందుకే ఇలా కనిపిస్తున్నా.. ఓపెన్‌గా చెప్పేసిన జబర్దస్త్ యాంకర్

జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ప్రస్తుతం తెలుగు బుల్లితెర పై ఉన్న టాప్ మోస్ట్ యాంకర్లలో ఆమె కూడా ఒకరు. జబర్దస్త్ తో పాటు శ్రీదేవీ డ్రామా కంపెనీ, ఢీ వంటి టీవీ షోలకు యాంకర్ గా వ్యవహరిస్తోంది రష్మీ. ఇక అప్పుడప్పుడు సినిమాల్లోనూ మెరుస్తూ ఫ్యాన్స్ ను ఖుషి చేస్తోంది. కాగా ఇప్పుడు రష్మీ మరో రియాలిటీ షోకు హోస్ట్ గా వ్యవహరిస్తోంది. ఆహా ఓటీటీలో టాప్ తెలుగు ఇన్ ఫ్లూయెన్సర్ పేరుతో ట్యాలెంట్ హంట్ షో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ షోకు మంచు లక్ష్మీ, వైవా హర్షతో పాటు రష్మీ కూడా జ్యూరీగా వ్యవహరిస్తోంది. తాజాగా ఈ షో ప్రమోషన్స్ లో పాల్గొన్న రష్మీ తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా తన శరీరాకృతిపై వచ్చిన కామెంట్స్ పై ఓపెన్ గా మాట్లాడింది. ఈ ఈవెంట్ లో భాగంగా యాంకర్.. ‘మీరు ఈ మధ్యకాలంలో కాస్త బొద్దుగా, లావుగా కనిపిస్తున్నారు’ అని అడగ్గా రష్మీ ఇలా ఆన్సర్ ఇచ్చింది. ‘నిజం చెప్పాలంటే నాకు ఇలా కనిపించడం అస్సలు ఇష్టం ఉండడం లేదు. కెమెరా ముందు కనిపించే లుక్ వాస్తవానికి భిన్నంగా ఉంటుంది. కెమెరాల వల్ల కూడా కొంతమంది రియల్ కంటే ఇంకా లావుగా కనిపిస్తారు. అయితే నేను ఇలా కనిపించడానికి ప్రధాన కారణం నాకున్న కొన్ని ఆరోగ్య సమస్యలు. ఆ సమస్యల ప్రభావం వల్లే నా శరీరంలో మార్పులు వచ్చాయి. అందుకే ఇప్పుడు కాస్త బొద్దుగా కనిపిస్తున్నాను. అయితే ఈ పరిస్థితి కూడా శాశ్వతం కాదు. ప్రస్తుతం ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి సారించాను. ఆరోగ్య సమస్యల నుంచి కోలుకున్న తర్వాత మళ్లీ ఫిట్‌గా, స్లిమ్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తాను. గత 20 ఏళ్లుగా ఈ సినిమా ఇండస్ట్రీలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు, అపజయాలు రెండింటిని ఫేస్ చేశారు. అయినప్పటికీ ప్రతి అనుభవం నాకు కొత్త పాఠం నేర్పింది. అందుకే జీవితంలో ఎలాంటి కఠిన పరిస్థితులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవడం అలవాటు అయింది’ అని చెప్పుకొచ్చింది రష్మీ. ప్రస్తుతం ఈ జబర్దస్త్ యాంకర్ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.



## కొరియన్ కనకరాజు’ టీజర్ రిలీజ్..

### రాయలసీమ మాస్, కొరియన్ స్వాగ్‌తో అదరగొట్టిన వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న వినూత్న హారర్ కామెడీ చిత్రం కొరియన్ కనకరాజుపై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా సినిమా టీజర్‌ను విడుదల చేసింది. వినోదం, హారర్, యాక్షన్, కామెడీ అంశాలతో నిండిన ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ టీజర్‌ను రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేయడం విశేషం. విడుదలైన కొద్ది సేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసిందిటీజర్ ప్రారంభంలో వరుణ్ తేజ్ తన రాయలసీమ గ్రామాన్ని పరిచయం చేసే సన్నివేశాలు కనిపిస్తాయి. అయితే ఆ విజువల్స్‌తో పాటు బ్యాక్‌డ్రాప్‌లో కొరియాకు సంబంధించిన దృశ్యాలు కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. రాయలసీమ నేపథ్యంలో ప్రారంభమయ్యే కథ ఎలా కొరియాతో అనుసంధానమవుతుందనే అంశాన్ని దర్శకుడు ఆసక్తికరంగా దాచిపెట్టారు. ఈ చిత్రంలో కనకరాజు పాత్రలో వరుణ్ తేజ్ పక్కా రాయలసీమ యువకుడిగా కనిపిస్తారు. ఆయనకు స్నేహితుడిగా నటుడు సత్య తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఇద్దరి మధ్య వచ్చే సంభాషణలు నవ్వులు పంచేలా ఉండనున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. అదే సమయంలో వరుణ్ తేజ్ మరో గెటప్‌లో కొరియన్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్టైలిష్ మేకోవర్, బాడీ లాంగ్వేజ్, స్వాగ్‌తో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించిన వరుణ్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. టీజర్‌లో వరుణ్ తేజ్ పాత్రకు దెయ్యం పట్టిన తర్వాత జరిగే పరిణామాలను హాస్యభరితంగా చూపించారు. హారర్, కామెడీ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వరుణ్ తేజ్ రెండు విభిన్నమైన షేడ్స్‌లో చూపించిన నటన, కామెడీ టైమింగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు మరింత బలం చేకూర్చింది. హారర్ సన్నివేశాల్లో ఉత్కంఠను, కామెడీ సన్నివేశాల్లో వినోదాన్ని సమానంగా ఎలివేట్ చేస్తూ థమన్ తన మార్క్‌ను మరోసారి చూపించారు. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ నిర్మాణ విలువలతో సినిమాను రూపొందిస్తోంది. క్రాస్-కల్చరల్ హారర్ కామెడీ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నట్లు టీజర్ ద్వారా  అర్థమవుతుంది.

## ముఖ్యమంత్రి లక్ష్మీప్రణతిగా..



సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్న చిత్రం ‘క్వీన్’. సామాజికాంశాలతో ముడిపడ్డ ఈ లేడీ ఓరియెంటెడ్ డ్రామాకి రతన్ రిషి దర్శకుడు. వన్ సర్కిల్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో ముఖ్యమంత్రి లక్ష్మీప్రణతిగా సీనియర్ నటి రమ్యకృష్ణ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూట్‌లో ఆమె జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. నిజజీవిత పాత్రల స్ఫూర్తితో, వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న ఫిక్షనల్ స్టోరీ ఇదని, సమాజంతో ముడిపడ్డ ఓ ఆసక్తికరమైన ప్రేమకథను ఇందులో చూస్తారని మేకర్స్ తెలిపారు. రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో సాయికుమార్, తనికెళ్ల భరణి, అజయ్‌ఘోష్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: బాల ఎన్. సరస్వతి, సంగీతం: భరత్ ఎం

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465